www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 జనవరి 2025
5
కాకినాడ



పట్టపగలే వెలుగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని కొత్త కాలువ గట్టు నుంచి వాలు తిమ్మాపురం రహదారిలో పట్టపగలే వీధిలైట్లు వెలుగు తూనే ఉన్నాయి. గత కొద్ది కాలంగా ఇదే పరిస్థితి కొనసా గుతోంది. అనేక ప్రాంతాల్లో రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగటం లేదని, కొన్ని ప్రాంతాలలో మాత్రం పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణ శివారు ప్రాంతాలు, కాలనీల్లో రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగక ఆ ప్రాంతవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


పట్టపగలు వెలుగుతున్న లైట్లు

అంగన్‌వాడీలను వెంటాడుతున్న కష్టాలు

- తరచూ మొరాయిస్తున్న యాప్‌లు
- సాంకేతిక సమస్యలతో సతమతం
- పిల్లల వివరాల నమోదుకు ఆటంకం
- వేతనాల్లో కోత అంటూ బెదిరింపులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్న కార్యకర్తలను కష్టాలు వెంటాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే క్షేత్ర స్థాయిలో అనేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగానే ప్రీ స్కూల్ పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు 'పోషన్ ట్రాకర్' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. కానీ పలు సాంకేతిక సమస్యలు కారణంగా సెల్ ఫోన్లు తరచూ మొరాయిస్తున్నాయి.



కాకినాడ జిల్లాలో 1927 మెయిన్, 59 మినీ మొత్తంగా 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 13,134 మంది గర్భిణులు, 11,518 మంది బాలింతలు, 62,170 మంది 6 నుంచి 36 నెలలు గల చిన్నారులు, 29,728 మంది 36 నుంచి 76 నెలలు గల పిల్లలు ఉన్నారు. వీరంతా కేంద్రాల్లో పౌష్టికాహారం అందుకుంటున్నారు. అంగన్‌వాడీలు రోజూ వారి కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న చిక్కిలు, కోడిగుడ్లు, బాలామృతం, పిచు పదార్థాలు కలిగిన కూరలు వండి ఆహారంలో తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా మాతా, శిశువులు ఆరోగ్యంగా ఉండి సుఖ ప్రసవాలు జరుగుతాయని ప్రభుత్వ లక్ష్యం.

యాప్ సోపాలు

3 నెలల నుంచి 6 సంవత్సరాల లోపు ప్రీ స్కూల్ పిల్లల వివరాలను ప్రతీ రోజూ హాజరు వేయాల్సి ఉంది. దీనిలో భాగంగా పిల్లల ఫోటో తీసి 'పోషణ ట్రాకర్' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఏరోజుకారోజు చిన్నారుల గ్రూపు ఫోటో తీసి యాప్‌లో అప్ లోడ్ చేయాలి. సెంటర్‌కు వచ్చిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఇది పూర్తి చేయాల్సి ఉంది. అయితే ప్రతీ సారీ సాఫ్ట్ వేర్ వెర్షన్ మారుస్తున్న కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు, మూడు, వారం రోజులు వ్యవధిలో మార్పులు, చేర్పులు చేస్తుండడం వలన సాంకేతిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నాసిరకం ఫోన్లు సక్రమంగా పని చేయడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఇచ్చిన కావడంతో చాలా మంది వాటిని పక్కన పెట్టి సొంతంగా కొనుగోలు చేసుకున్న ఫోన్లను వినియోగిస్తున్నారు. కొంతమంది తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లనే వాడుతున్నారు. అయితే స్టోరేజ్ రామ్ తక్కువగా ఉండడం వలన ఫోన్ హ్యాంగ్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన ఫోన్ల స్థానంలో కొత్త ఫోన్లను రీ ప్లేస్ చేయడం లేదు.

వేతనాల్లో కోతలు అంటూ బెదిరింపులు

సాంకేతిక సమస్యలతో అంగన్‌వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ వాటిని సరి చేసేందుకు ప్రయత్నం చేయాల్సిన అధికారులు యాప్‌లో పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తామని బెదిరింపులకు దిగుతుండడం శోచనీయం. ఇప్పటికే కాకినాడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో జగన్నాయక్ పూర్, పెద్దాడ, రాగంపేట అంగన్‌వాడీ వర్కర్లకు అధికారుల నుంచి హెచ్చరికలు అందాయి. యాప్ లోపాల వలన వర్కర్ల కేంద్రంలో ఉన్నప్పటికీ లోకేషన్ స్థానికంగా చూపించకపోవడంతో వివరాలు యాప్ నమోదు కావడం లేదు. పొద్దస్తమాను కుస్తీ పడుతున్నప్పటికీ చివరిలో వివరాలు నమోదయ్య పరిస్థితి ఏర్పడింది. గంటల తరబడి వీటి కోసం సమయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు వివరిస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని వర్కర్లు ఆరోపిస్తున్నారు.

యాప్‌ల పని భారాన్ని తగ్గించాలి



అంగన్‌వాడీ వ్యవస్థపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అదనపు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీనికితోడు యాప్‌ల పని భారంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్షణమే సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి. అధికారుల ఒత్తిళ్లను నిలిపివేయాలి.

ఇ.చంద్రావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్


జగ్గంపేట పశువుల ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - జగ్గంపేట

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిదీ అనికలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. బుధవారం కిర్లంపూడి పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. అలాగే బూరుగుపూడి సచివాలయం, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిం చారు. అలాగే జగ్గంపేట మండలం మామిడాడలో నూతనంగా నిర్మించిన గోకులల షెడ్డును ఆయన ప్రారంభించారు. కాండ్రేగులలో ఉపాధిహామీ పథకంలో చేస్తున్న చెరువు పనులను పరిశీలించారు. జగ్గంపేట పశువుల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న పరిసరాల పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత శనివారం ఆసుపత్రి పరిసరాలను ఎందుకు శుభ్రం చేయాలని నిలదీశారు. వచ్చే శనివారం వెటర్నరీ 12 మంది సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గాల పర్యటనలో భాగంగా పర్యటించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ చంద్రశేఖర్, సిడిపిఒ పూర్ణిమ, పశు వుల వైద్యులు డాక్టర్ తాతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్లో ఈనెల 24 నుంచి 26 వరకుఉభయ తెలుగు రాష్ట్రాల షష్టమ నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహ ఆర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు గొందేశి రాజా, ఇంధన బ్రహ్మానందం తెలిపారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ఈ పోటీలను ఎపిఐఐసి జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిలుగా ఎస్ఐ వి.మౌనిక, చంద్రమాంపల్లి సర్పంచ్ కురుమెళ్ళ లోవరాజు, ఎంపిటిసి సభ్యులు గోపు వరలక్ష్మి పాల్గొంటారన్నారు. అనంతరం కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో 'ఖరీదైన జైళ్ళు' నాటికను ప్రదర్శిస్తారన్నారు. పాలకొల్లుకు చెందిన నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో 'అనూహ్యం' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 25న హైదరబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ' నాటికను, బాపట్ల సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో 'వర్క్ ఫ్రం హోం' నాటికను, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'రాత' నాటికను ప్రదర్శిస్తారన్నారు. 26న అమరావతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'చిగురు మేఘం' నాటిక, హైదరబాద్ మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'ఇది రహదారి కాదు' నాటికను, చంద్రమాంపల్లి స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'చింత చచ్చినా' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రదర్శన అనంతరం జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు.

ఏలేరు జలాల విడుదల

ప్రజాశక్తి - సామర్లకోట

ఏలేరు ప్రాజెక్టు ఆయకట్టు 53,017 ఎకరాలకు రబీ సాగుకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు సామర్లకోట ఇరిగేషన్ డిఇ ఆకెళ్ళ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఏలేరు కాలువ పరిధిలో రబీ వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఏలేరు ప్రాజెక్టు నుంచి 1400 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా దానిలో 200 క్యూసెక్కుల నీటిని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇస్తున్నా మన్నారు. మిగిలిన 1200 క్యూసెక్కులు రబీ వరిసాగుకు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం జలాల విడుదల ద్వారా ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పొలాల్లో పర్యటిస్తున్న డిఇ రవికుమార్

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ గుణశేఖర్ హెచ్చరించారు. మండలంలోని విరవ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల రక్షణ కొరకు స్కూలు సమయం ముగిసిన తర్వాత పరిసర ప్రాంతంలో మహిళా రక్షక బీట్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినులను ఆకతాయిలు ఎటువంటి ఇబ్బందులు కలుగచేసినా తక్షణమే ఉపాధ్యాయులు పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. దానిపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సత్తిబాబు, ఇతర సిబబంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు తగవు

ప్రజాశక్తి - కాజులూరు

రెవెన్యూ సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలు తగదని మండల రెవెన్యూ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ఈశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కోలంక గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశాలకు హాజరుకాలేదని మండలం లోని విఆర్‌ఒలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌లకు మోమోలు జారీ చేయడంపై 24 గంటల్లోనే సంజాయిషీ ఇచ్చామని అన్నారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. ఎంపిడిఒ వైఖరి విభజించు పాలించు అనే విధానంలో ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయా లని విఆర్‌ఒలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సర్వేయర్లకు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకుండా వెసులుబాటు ఇచ్చారని, సంబం ధిత అంశాన్ని తహశీల్దార్ ఇప్పటికే ఎంపిడిఒకు లేఖ ద్వారా తెలియచేశారని అన్నారు. అయినా ఎంపిడిఒ కక్షపూరితంగా తమకు మోమోలు జారీ చేశారని అన్నారు. ఈ సమావేశంలో విఆర్‌ఒలు రాధాకృష్ణ, ఆదినారాయణ, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

వైసిపిని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, పిఠాపురం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలో ధర్మవరం, రాచపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దశాబ్దాల కాలం నుంచి రాజకీయాల్లో ఉన్నామని, నియోజకవర్గం ప్రజలు అందిస్తున్న ఆదరణ మరువలేనని అన్నారు. నా తనయుడు గిరిబాబు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాడని, త్వరలోనే గిరిబాబు నియోజకవర్గంలో పర్యటిస్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం సర్పంచ్ బెండుకుర్తి సుశీల, వైసిపి నాయకులు జల్లిగంపల ప్రభాకర్‌రావు, బంకు శ్రీను, బొల్లు చిట్టిబాబు, బొల్లు నాని, జువ్వల చిన్నబాబు పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పని చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత సూచించారు. వైసిపి పట్టణ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన రావుల మాధవరావుకు అభినందన సభను బుధవారం బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిని ఆమె శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ అధినేత జగన్ దిశానిర్దేశం చేశారని, అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. రావుల మాధవరావు మాట్లాడుతూ తనకు అధ్యక్షునిగా నియమించిన పార్టీ అధినేత జగన్, మాజీ ఎంపి గీత, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుల బి.పెదకాపు, పి.రాజేష్, వి.భూషణం, సుదర్శన్, బాబులు, ఎం.శ్రీనివాస్, బత్తుల సాయి, భవాని, అడపా రఘు, సుధారాణి, మోహిద్దీన్ పాల్గొన్నారు.


ప్రత్తిపాడు పర్యటనలో రైతును పలకరిస్తున్న ముద్రగడ

31 నుంచి కాకినాడలో ఎపి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ జెఎన్‌టియుకెలోని ఇండోర్ స్టేడియంలో 1వ ఎన్‌టిఆర్ మెమోరియల్ ఎపి తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహించనున్నారు. తిరుపతిలోని డిఎస్‌డిఒ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాప్ ఛైర్మన్

చెత్త నుంచి సంపద సృష్టించాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తడి, పొడి చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఇఒపిఆర్‌డి క్రరి హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. బుధవారం ఉప్పాడ సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని అన్నారు. సంపూర్ణ పారిశుధ్యం అమలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరుగున పడిన చెత్త కేంద్రాన్ని వినియోగం తీసుకొస్తే సంపదను సృష్టించవచ్చని తెలిపారు. మండలంలో అనేక గ్రామాల్లో ఉన్న అన్ని చెత్త సంపద కేంద్రాల్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - పెద్దాపురం, కరప

మండలంలోని ఉలిమేశ్వరంలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, నట్టల నివారణ చికిత్సలు చేశారు. వివిధ వ్యాధుల నివారణకు మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పశుసంవర్థక శాఖ ఎడి తుమ్మల రామస్వామి మాట్లాడుతూ మండల పరిధిలో ఈ నెల 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో రాయ భూపాలపట్నం పశు వైద్యాధికారి డాక్టర్ రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కరప మండలంలోని పెనుగుదురులో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఎడి సురేష్‌బాబు, వైద్యులు డాక్టర్ రవికిరణ్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు, బండారు మురళి, పన్నీరు శివ, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మందులను పంపిణీ చేస్తున్న నాయకులు

పెసా చట్టంపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

గిరిజన మండలాల్లో నివసించే ప్రజల హక్కులను కాపాడేందుకు 'పెసా' చట్టంపై స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎపిఎఐఆర్‌డి జెడి శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ జె.రామానాదం మాట్లాడారు. పెసా చట్టాన్ని అవగాహన చేసుకుని గిరిజన ప్రాంతాల, ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. గిరిజన మండలాల్లో ఫిబ్రవరి నెలలో పెసా చట్టంపై ప్రజలకు, అధికారులకు, ఎస్‌హెచ్‌జి సభ్యులకు, ఎన్‌జిఒలకు మాస్టర్ ట్రైనీలు శిక్షణ కల్పించాలన్నారు. 5 జిల్లాలకు చెందిన 36 ఏజెన్సీ మండలాలకు సంబంధించి 215 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, కెఆర్.నిహారిక, వి.ఆంజనేయులు, ఎం.చక్రపాణిరావు, డిఆర్‌ఎన్ పద్మజ, పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి ప్రిన్సిపల్ వేణుగోపాల్ సర్టిఫికెట్లను అందజేశారు.


సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపల్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని తూర్పు లక్ష్మీపురంలో సర్పంచ్ డాక్టర్ వీరంరెడ్డి నాగ భార్గవి అధ్యక్షతన జరిగిన జిపిడిపి గ్రామ సభలో ఆమె మాట్లాడారు. గ్రామాన్ని రిసోర్స్ మ్యాపింగ్ చేయడం వల్ల పారిశుధ్య వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఇజనగిరి ప్రసాద్, ఉప సర్పంచ్ బూరెల అప్పారావు, ఎంపిడిఒ సూర్యనారాయణ, కార్యదర్శి వీరబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపిపి బుజ్జి

పారిశుధ్య లోపంతో మరుగుదొడ్లు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతమైన రాఘవపట్నంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు పారిశుధ్య లోపంతో దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు నిర్వాహణ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్డి ప్రాంతంలో తుప్పలు పెరిగిపోవడంతో విష పరుగులకు నెలవుగా మారింది. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పారిశుధ్య పనులతోపాటు, మరుగుదొడ్ల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.



మరుగుదొడ్డి చుట్టూ పెరిగిపోయిన గండి

ఆధార్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కరప

ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.అనుపమ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 0 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు కాని వారి కోసం నూతనంగా ఆధార్ నమోదు కొరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం 23, 24 తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


కార్టూ'నిజం'



ఎస్‌సి వర్గీకరణ జాతీయ ఐక్యతకు ముప్పు

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి వర్గీకరణ జాతీయ ఐక్యతకు ముప్పని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ జరిగితే దేశం రెండు ముక్కలవుతుందన్నారు. రాబోయే 20 ఏళ్లలో ఉత్తర భారతదేశం, దక్షిణ భారత దేశంగా అవతరించడం ఖాయమన్నారు. కారణం ఉత్తర భారతదేశంలో మాదిగలెక్కువగా ఉంటారని, దక్షిణ భారతదేశంలో మాలలెక్కువగా ఉంటారని అన్నారు. ఎస్‌సి విభజన వల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలుగా విడిపోయాయని అన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎస్‌సి వర్గీకరణపై తన అభిప్రాయం బయటపెట్టాలన్నారు. టిడిపి పుట్టుక దళితులపై అసూయతోనే జరిగిందని అన్నారు. ఒక్కటిగా కలిసి ఉన్న మాల, మాదిగలను రాజకీయ ప్రయోజనాల కోసం ఎలాగైనా వేరు చేయాలని టిడిపి కుట్రలు పన్నిందని అన్నారు. అప్పటి కాంగ్రెస్ నేత పర్వతనేని ఉపేంద్ర మాట్లాడిన మాటలు స్వయంగా తానే విన్నానన్నారు. సుప్రీం కోర్ట్ 7గురు న్యాయమూర్తులు ఇచ్చింది ఆర్డర్ కాదు, అది డిజార్డర్ అని వ్యాఖ్యానించారు. 1994లో కాన్షీరామ్ ఎపికి వచ్చి 1700 మండలాల్లో తిరిగారని ఎస్‌సి, ఒబిసిలను కలపాలని, ఉత్తరప్రదేశ్ ఫార్ములా ఎపిలో సక్సెస్ చేయాలని ఆశించారన్నారు. కాన్సిరాం రాకతో కొంత మందికి కడుపు మండిందని, అప్పుడే వారి మనస్సులో మాల, మాదిగ విభజనకు బీజం పడిందన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు ఎస్‌సిల విభజనకు పూనుకోవడం జరిగిందన్నారు. యుపి, తమిళనాడు, కేరళలో రాష్ట్రాల్లో లేని ఏకసభ్య కమిషన్‌ను ఎపిలో వేయడం తప్పన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్రం చేస్తున్న రూ.11 వేల కోట్ల సాయం ఆకలితో ఉన్నవాడి చేతికి అరటి పండు ఇచ్చినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఉక్కు ఫ్యాక్టరీని ఐసియులోకి నెట్టింది టిడిపి ప్రభుత్వమేనని విమర్శించారు.


మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

ఆర్థిక సంఘం నిధుల కోసం కృషి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలంలోని పాలకవర్గాలు లేని 6 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను రాబట్టేందుకు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. బుధవారం స్థానిక గుడారిగుంటలో ఉన్న ఎంఎల్‌ఎ కార్యాలయంలో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కోరుతూ ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన ఉన్న ఈ ఆరు గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు జరగని కారణం చేత 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని అన్నారు. ఆయా పంచాయతీల ఆర్థిక పరిస్థితిని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసికెళ్లి 15వ ఆర్థిక సంఘం నిధులను రాబట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రాజా, బుద్ధరాజు సత్యనారాయణరాజు, దాసరి శ్రీధర్ పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఫిబ్రవరి 15 నుంచి 28వ తేదీ వరకూ జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు సన్నాహక ఏర్పాట్లపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులతో 40 టీములు పాల్గొంటాయని తెలిపారు. ఈ జాతీయ స్థాయి క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు స్టేడియంను సిద్ధం చేయాలని, క్రీడాకారులకు అవసరమైన వసతి, భోజన, రవాణా ఏర్పాట్లను ఎటువంటి లోపాలు లేకుండా కల్పించాలని సూచించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన హాకి టర్ఫ్ చుట్టూ గ్యాలరీలు, క్రీడాకారులకు డ్రెస్ చేంజింగ్ రూంలు, లైటింగ్, క్రీడాకారులు, ఎంపైర్లు, క్రీడల నిర్వహణ అధికారులు బస కొరకు గదులు తదితర సదుపాయాలను రాష్ట్ర బేవరేజస్ కార్పోరేషన్ ద్వారా రూ.8 కోట్లు నిధులు స్పాన్సర్ చేసేందుకు ప్రతిపాదిస్తూ డిపిఆర్ సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి ప్రధాన కమిటీ వివిధ అంశాల సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. తదుపరి ఫిబ్రవరి 2 నుంచి 5వ తేదీ వరకు వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించనున్న జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. అలాగే ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకూ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో రాష్ట్ర స్థాయి వ్యాయమ ఉపాధ్యాయుల క్రీడలు నిర్వహణ ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకట్రావు, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసకుమార్, ఆర్ అండ్ బి ఎస్ఇ జె.కాంతు, డిఇఒ పి.రమేష్, ఆర్‌టిఒ జి.శివరెడ్డి, జిల్లా హాకీ అసోషియేషన్ డైరెక్టర్ వి.రవిరాజ్, రాష్ట్ర పిఇటిల సంఘం అధ్యక్షులు ఎల్.జార్జి, రాష్ట్ర టెన్నీస్ అసోషియేషన్ అధ్యక్షులు శ్రీరామ్ కుమార్, స్పాన్సరింగ్ సంస్థలు అపోలో, మెడికవర్ ప్రతినిధులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

సహస్రలో హైస్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సహస్ర ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ ఏడాది నుంచి హైస్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వరరావు, సత్యశ్రీలు తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నూతనంగా ప్రారంభిస్తున్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు క్లాసులన్నీ డిజిటల్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. కాకినాడ జిల్లాలో హైస్కూల్లో డిజిటల్ క్లాసుల ద్వారా విద్యను బోధించడం సహస్ర సంస్థ ద్వారానే ప్రారంభం అవుతుందని వివరించారు. ఇప్పటివరకు సహస్ర కాలేజీలో ఉత్తమ ఫలితాలు సాధించామని, సరికొత్తగా హైస్కూల్లో కూడా మంచి ఫలితాలు సాధించాలని రాజస్థాన్‌కు చెందిన ఎల్లెన్ సంస్థతో ఎంఒయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సంస్థ 6 నుంచి 9 వరకు జూనియర్ ప్లస్ వన్, సీనియర్ ఇంటర్ ప్లస్ టు వరకు ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తుందన్నారు. తమ సంస్థ 2018లో ఇంటర్‌తో పాటు మెడికల్ అకాడమీని ప్రారంభించిందని, కొద్ది రోజుల్లోనే మెడికల్ అండ్ నీట్ ఎంట్రన్స్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. ఈ డిజిటల్ తరగతులకు క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ ద్వారా క్లాసులు నిర్వహిస్తామని ఎల్లెన్ డైరెక్టర్ ఎన్.సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ప్రతినిధులతో పాటు మోటివేటర్ డి.వెంకటేశ్వరరావు, సహస్ర కాలేజ్ ప్రిన్సిపల్ రాజు, ఫిజిక్స్ లెక్చరర్ శివరాం, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యాజమాన్యం ప్రతినిధులు

ముందస్తుగా గణతంత్ర దినోత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్‌లో ముందస్తుగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ వేడుకలో ఎంపిడిఒ కె.సత్యనారాయణ జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హోప్ ఐలాండ్‌లో ముందస్తుగా ఈ వేడుకను నిర్వహించినట్లు చెప్పారు. దేశ సరిహద్దుల రక్షణలో భాగంగా హోప్ ఐలాండ్ భారత భూభాగంలోనిది అని తెలియజేయడానికి జాతీయ జెండా ఎగురవేసినట్లు తెలిపారు. చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సిఐ రామ్మోహన్ రెడ్డి, పోర్టు సిఐ రమణ, నేవి అసిస్టెంట్ కమాండెంట్ మణిషచాన్, కోరంగి ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్, ఎఫ్‌డిఒ గోపి, ఆర్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి విజెవి రమణ, నాయకులు పాల్గొన్నారు.

కావమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక కావమ్మ పేరంటాలు ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సామర్లకోట ఏలేరు, గోదావరి కాలువల మధ్య ఉన్న కావమ్మ పేరంటాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించ్చారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, శెట్టి బత్తుల దుర్గారావు , పార్టీ క్రీడా కన్వీనర్ నిమ్మకాయల కిరణ్ కుమార్ లు ప్రారంభించారు.

యానాం వార్తలు

యువతకు ఆటలు పోటీలు

ప్రజాశక్తి - యానాం

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్పోర్ట్స్ మీట్ బుధవారం జరిగింది. స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, సైక్లింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలో విజేతలకు ఐటిఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్, కళాశాల సూపరింటెండెంట్ విద్యాసాగర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కొప్పనాతి రమేష్, నక్కల సుబ్బన్న, చింతం రామకష్ణ, వడ్డీ వరప్రసాద్, పోతుల సోమేశ్, వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీటిని అందించాలి

ప్రజాశక్తి - యానాం

ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని పర్యావరణ పరిరక్షణా సమితి కో-ఆర్డినేటర్ దుగ్గుదుర్తి అనిత కోరారు. బుధవారం ఆర్ఎఒ మునిస్వామిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందించే తాగునీటిపై పిడబ్ల్యుడి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే సురక్షితమైన త్రాగునీటిని ప్రజలకు అందించాలని కోరారు.

చొల్లంగిలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగిలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డి.సుధ పాల్గొని మాట్లాడారు. పశువుల్లో నట్టల నివారణ, గాలికుంటు వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు వచ్చే వ్యాధుల నియంత్రణకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉప సర్పంచ్ స్వర్ణరాజు, స్థానిక పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మారుతున్న యాంత్రిక యుగంలో రైతన్నలు సాంకేతికతపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని లింగంపర్తి, సిరిపురం, పేరవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎన్‌పిఎస్ఎస్ యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తమ పొలాల్లో ఉన్న పురుగులు లేదా తెగుళ్ల వివరాలను ఫోటోలను తీసి అప్‌లోడ్ చేయడం ద్వారా తక్షణ నివారణ మార్గం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, నీటి సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతదేహం వెలికితీత.. పోస్టుమార్టం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు బుధవారం మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని మూలపేట గ్రామం ప్రకాష్ నగర్‌కు చెందిన వివాహిత గింజల బాల (25) రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతదేహానికి వెంటనే అత్యక్రియలు నిర్వహించేశారు. ఈ నేపథ్యంలోనే మృతిరాలి తల్లి గింజల లక్ష్మి తన కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించి అత్యక్రియలు నిర్వహించేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం తహశీల్దార్ చిన్నారావు, ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది భూమిలో కప్పిట్టేసిన మృత దేహాన్ని వెలికితీశారు. అక్కడే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఇల్లు దహనం కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

ములగపూడిలో తాటాకిల్లు దహనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా బాధితుడు నీలి చిన్నబ్బాయికి, అదే గ్రామానికి చెందిన ఇంధన బాబ్జి, పారుపాక గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజుకు మధ్య సెల్‌ఫోన్ కోసం ఘర్షణ జరిగింది. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో వారిద్దరూ కలిసి తాటాకు ఇంటిని దహనం చేసినట్లు తమ విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. వారిద్దరినీ తుని కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

గడ్డి మేటు దగ్ధం

ప్రజాశక్తి - కరప

కరప శివారు పేపకాయలపాలెంలో మంగళవారం రాత్రి 11:30 సమయంలో 100 ఎకరాల పంటకు చెందిన గడ్డి మేటు దహనం అయింది. ఈ సంఘటనకు సంబంధించి గడ్డి మేటు రైతు సలాది శ్రీనుబాబు మాట్లాడుతూ తాను గడ్డి వ్యాఎతారం చేస్తానని, గడ్డి నిల్వ పెట్టుకునికాకినాడ మార్కెట్లో అమ్మకం చేస్తుంటానని తెలిపారు. సుమారు 100 ఎకరాల పంటకు సంబంధించిన గడ్డిని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతుల నుంచి కొనుగోలు చేసుకుని నిల్వ చేసినట్లు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారే మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని, మొత్తం గడ్డి దహనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన నాయకుడు భోగిరెడ్డి గంగాధర్ కోరారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి శిరసపల్లి ఈశ్వరరావు (40) ఇంటి మేడపై నుంచి మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. భార్య సిరసపల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం షాప్ సీజ్

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో పెద్దాడ గ్రామంలో నంబర్ 0435015 రేషన్ షాపులో బియ్యం గల్లంతుపై కేసు నమోదు చేసినట్లు మండల సివిల్ సప్లయి అధికారి కమల కుమారి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ. పెద్దాడ గ్రామానికి చెందిన బక్కి రవికుమార్ రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించగా 60 బస్తాల రేషన్ బియ్యం గల్లంతు జరిగిందన్నారు. రేషన్ షాపును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల జాతీయ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. కాకినాడ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులను ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన పసల వెంకటేష్, ప్రసాద్‌లుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. దీనిపై బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గోగన్నమఠం పల్లిపాలెంకు చెందిన పసింగు బ్రహ్మయ్య (49) ఈనెల 21న సాయంత్రం తన ఇంటి వద్ద నుంచి డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న చెరువులో వేటకు వెళ్లాడు. అయితే అతను చెరువులో వేటాడుతూ ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొనిచనిపోయాడు. దీనిపై మతుని కుమారుడు పేసింగు గణేష్ ఫిర్యాదు మేరకు బుధవారం నగరం ఎఎస్ఐ పి.కృష్ణ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా పంట కాలువలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యయ్యింది. సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వ్యకి మృత దేహంపై నిక్కరు మాత్రమే ఉంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీలో భద్రపరిచారు. రాజోలు విఆర్ఒ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకి తెలిసిన వారు తమకు తెలియచేయాలని రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్ తెలిపారు.

దళిత మైనారిటీ వర్గాలకు సమన్యాయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దేశంలో అత్యధికంగా ఉన్న నిమ్న, దళిత మైనారిటీ సామాజిక వర్గాలకి సమన్యాయం అందించేలా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు విజయకుమార్ అన్నారు. బుధవారం రూరల్ మండలం పెనుమర్తి గ్రామంలో పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఎన్.కృష్టాఫర్, ఇతర నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అణగారిన వర్గాలకు, మైనారిటీ, దళిత వర్గాలకు మేలు జరిగేలా తాము కృషి చేస్తామన్నారు. రాజ్యాధికారంలో అత్యధిక స్థానాలు దక్కించుకునేలా ఇప్పటినుంచి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామ శివారు వరకూ పదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పులుగు నాగేశ్వరరావు, శివకోటి రాము, బెదంపూడి కృష్ణ, కల్దరి కుమారబాబు, పెదరాజు, సివకోటి అన్నవరం, పాల్గొన్నారు.

దర్గా వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాత పెద్దాపురం లోని హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా,రహమతుల్లా ఔలియా దర్గా వద్ద గందోత్సవం ముగింపు సందర్భంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ బొడ్డు బంగారుబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, వంగలపూడి సతీష్, దర్గా కమిటీ అధ్యక్షులు ఎండి లాయక్ అలీ, హాజీ షేక్ బాబూలాల్, ఎం డి ఆశిక్ అలీ, ఎస్ఎ రజాక్, సయ్యద్ కరీం జానీ, షేక్ గౌస్, షేక్ రఫీ, షేక్ బాబ్జి, హెచ్ఎ జలీల్, షబ్బీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - తుని

పట్టణంలో కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తుని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సలుగు కృష్ణశేఖర్ కోరారు. బుధవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడుని బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణశేఖర్ మాట్లాడుతూ శిధిలావస్థలో ఉన్న కోర్టు భవనానికి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు యనమల సతీష్, సాన సత్తిబాబు, బోనం చినబాబు, మేడిది గణేష్, సిహెచ్‌వి.రమణ, వై.బద్రిసత్యనారాయణమూర్తి, పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయర్‌పై అవగాహన

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని అల్లిపూడిలో మండల వ్యవసాయశాఖ అధికారి కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభలో రైతులకు డ్రోను స్ప్రేయర్ పై అవగాహన కల్పించారు. డ్రోను స్ప్రేయర్ ఆపరేటింగ్, పైలెట్ ట్రైనింగ్‌పై ఆసక్తి ఉన్న రైతులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్రోన్ స్ప్రేరు కావలసిన వాళ్ళు గ్రూపుగా ఏర్పడి కొనుగోలు చేసుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కెవి.శివకుమారి, సురేష్, గ్రామ వ్యవసాయ సలహా అధికారి రేణుక, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

గ్రామ అభివృద్ధికి సచివాలయం సిబ్బంది సహకరించాలని టిడిపి యువ నాయకుడు జాస్తి వసంత అన్నారు. బుధవారం సచివాలయంలో సర్పంచ్ కుక్కల ఆనంద్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామంలో నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయిన్ పనుల తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న సమస్యల సత్వర పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని అన్నారు.

చెస్ విజేత సాయి సంతోష్‌కు సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

జాతీయస్థాయి స్కూల్ చెస్ పోటీలో అండర్-17 విభాగంలో ప్రథమ స్థానం సాధించిన పట్టణానికి చెందిన ముప్పన జ్ఞానసాయి సంతోష్‌ను పెద్దాపురం ఫేస్‌బుక్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎంలు ఎండి అబ్దుల్ హక్, కమర్జహాన్, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా సాయి సంతోష్‌ను పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ విజయవంతో సాయి సంతోష్ ఈ ఏడాది మార్చిలో సెర్బియాలో జరిగే వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొనేందుకు అర్హత సాధించాడన్నారు. అలాగే ఆగస్టు లేదా సెప్టెంబర్‌లలో జరగబోయే ఆసియా పాఠశాలల చెస్ ఛాంపియన్షిప్ అండర్-17 విభాగంలో సాయి సంతోష్ భారత దేశం తరుపున పాల్గొంటున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫేస్‌బుక్ బృందం సభ్యులు సత్యప్రశాంత్, రాస అధినేతజేష్ కుమార్, నెక్కల జంగారావు, శేఖర్, సత్యనారాయణ, లక్ష్మి, జయశ్రీ, రత్నం పాల్గొన్నారు.


విజేతను సత్కరిస్తున్న విశ్రాంత హెచ్‌ఎంలు, ఇతరులు

పేదలకు వస్త్ర దానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామ పురోహితులు కృష్ణమూర్తి భార్య సూర్యకాంతం జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు పేదలకు వస్త్రదానం చేశారు. బుధవారం పి.మల్లవరం పంచాయతీలోని 50 మంది నిరుపేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, ధూళిపూడి సుబ్బారావు, రాయుడు సింహ చలం, వెంటపల్లి నాగభూషణం, ఆనాల పాపారావు, ధూళిపూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

31న బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈనెల 31వ తేదీ ఉదయం ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన నగర పంచాయతీ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం జరుగుతుందని కమిషనర్ ఎన్.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కమిషనర్ కోరారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అచ్చియ్యపాలెం శివారున సారా బట్టీపై దాడి చేసి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 100 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సి లక్ష్మణరావు తెలిపారు. ఈ కేసులో అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన కుక్క వెంకటరమణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

కడియంలో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కడియం

కొవ్వూరు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో వరుసగా గొలుసు చోరీలకు పాల్పడ్డ బైకు దొంగలను పట్టుకునేందుకు జాతీయ రహదారిపై పోలీసులు జల్లెడ పట్టారు. బుధవారం ఇద్దరు యువకులు బైకుపై వచ్చి మహిళల మెడలో చైన్లను దొంగలించుకు పోవడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. వేమగిరి జంక్షన్‌లో సిఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఇతర పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు.

పోక్సో కేసులో ఉపాధ్యాయునికి జైలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.గోపాలకృష్ణమూర్తిపై పోక్సో కేసు రుజువు కావడంతో ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్టు ఉండ్రాజవరం ఎస్ఐ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మాగాపు మహాలక్ష్మి 2020లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అవినాష్ కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హైస్కూల్లో సోషల్ ఆడిట్ బృందం

ప్రజాశక్తి - సామర్లకోట

సోషల్ ఆడిట్ బృందం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను బుధవారం సందర్శించింది. సామాజిక తనిఖీలో భాగంగా ఎస్ఎంసితోపాటు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించింది. సోషల్ ఆడిట్ అధికారి కె.హరి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం అమలు, రికార్డుల నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత, మరుగు దొడ్ల నిర్వహణ, వివిధ రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేశారు. ఆర్ఒ ప్లాంట్, తరగతి గది నిర్వహణ, క్రీడా పరికరాలు తదితర అంశాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ అక్కిన చక్రధర్, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

డబ్బు కోసం ఆటోల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కుంచుకుని వారి ప్రాణాలతో చెలగాటమాడవద్దని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. బుధవారం ఉప్పాడ-పిఠాపురం జంక్షన్ వద్ద సిబ్బందితో ఆయన గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న వాహానాన్ని నిలుపుదల చేసి డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చారు. డబ్బుకోసం ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడవద్దని హితవు పలికారు. ఆటోలు, ఇతర వాహానాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థునులను ఎవరైనా అల్లరి చేస్తే కేసులు తప్పవని అన్నారు.